సాక్షి
ఏలూరు
శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



పారిజాతగిరిలో సీజీఎం

జంగారెడ్డిగూడెం: గోకులతిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ శాఖ సీజీఎం రవికుమార్, హెచ్ఆర్డీ జీఎం రాజు (విశాఖ) సందర్శించారు.



పవళింపు సేవ

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి రథసప్తమి ఉత్సవాలు పవళింపు సేవతో ఘనంగా ముగిశాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



వెండి విరాళం

తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలాంబ పురంలో ముత్యాలమ్మవారి చీర నిమిత్తం పెంటపాడు మండలం దర్శిపర్రుకి చెందిన మహిళలు 1.750 కిలోల వెండిని సమర్పించారు.

ఆర్టీసీ ఆదాయం అదుర్స్

- సంక్రాంతి సందర్భంగా 25 వేల మందికి పైగా రాకపోకలు
- 440 బస్సుల ద్వారా ప్రయాణం
- 3.52లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సులు
- గతేడాది కంటే రెట్టింపు ఆదాయం



ఏలూరు ఆర్టీసీ బస్టాండులో సంక్రాంతి ప్రయాణికుల రద్దీ (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్పేట): సంక్రాంతి పండగ ఆర్టీసీకి అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. హైదరాబాద్లో స్థిరపడిన ఉమ్మడి పశ్చిమగోదావరి ప్రజలు అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులను వినియోగించుకున్నారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడిపి గతేడాది కంటే రెట్టింపు ఆదాయం గడించారు. సాధారణంగా పండగల సీజన్లలో ప్రత్యేక బస్సులకు అధిక చార్జీలు వసూలు చేస్తుంటారు. అయితే ఈ విషయాన్ని సీఎం జగన్ తీవ్రంగా పరిగణించి సాధారణ చార్జీలే వసూలు చేయాలని ఆదేశించారు. దీంతో అధిక సంఖ్యలో ప్రయాణికులు ఈ ఏడాది ఆర్టీసీ బస్సుల వైపు మొగ్గుచూపారు.

ప్రయాణికుల రెట్టింపు

సంక్రాంతి పండగపై ఆర్టీసీ అధికారులు పెట్టుకున్న ఆశలను సజీవం చేస్తూ ప్రయాణికులు సర్వీసులను విశేషంగా ఆదరించారు. సాధారణ చార్జీలు మాత్రమే వసూలు చేస్తున్న కారణంగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకునే ప్రయాణికులు ఆర్టీసీ వైపు మరలడంతో సీఎం జగన్ తీసుకున్న చొరవ ఫలించిందనే చెప్పాలి. ఈ మేరకు ఆర్టీసీ గతేడాది కంటే గణనీయంగా ఆదాయం సమకూర్చుకోగలిగింది. సంక్రాంతి పండగకు ఏలూరు జిల్లా నుంచి గతేడాది 4,896 మంది ప్రయాణికులను హైదరాబాద్ నుంచి జిల్లాకు, జిల్లా నుంచి హైదరాబాద్కు చేరవేయగా ఈ ఏడాది 13,785 మందిని చేరవేయగలిగింది. అలాగే పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ప్రయాణికులను 4,467 మందిని గతేడాది చేరవేయగా ఈ ఏడాది 11,273 మందిని చేరవేసింది.

ఆదాయం అక్షరాలా రూ.కోటి.. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి ఆర్టీసీ డిపోల నుంచి ఈ ఏడాది సంక్రాంతి ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోగలిగింది. ఏలూరు జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి సంక్రాంతికి ముందు 103 బస్సులను తిప్పి 5,579 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా రూ.23,12,015 ఆదాయం తెచ్చుకోగా, సంక్రాంతి అనంతరం తిప్పిన 145 సర్వీసుల ద్వారా 8,206 మంది ప్రయాణికులను చేరవేయడం ద్వారా రూ.32,57,559 ఆదాయం గడించింది. మొత్తంగా 248 సర్వీసులను తిప్పి 13,785 మంది ప్రయాణికుల ద్వారా రూ. 55,69,574 ఆదాయం సమకూర్చుకుంది. పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం, తణుకు డిపోల నుంచి పండగకు ముందు 88 సర్వీసులను తిప్పి 4,645 మంది ప్రయాణికులను చేరవేయడం ద్వారా రూ.24,12,678 ఆదాయం సంపాదించగా.. సంక్రాంతి అనంతరం 104 సర్వీసులను తిప్పి 6,628 మంది ప్రయాణికుల ద్వారా రూ.29,03,544 ఆదాయం గడించింది. మొత్తంగా రెండు జిల్లాల్లో ఆర్టీసీ రూ.1,08,85,796 ఆదాయాన్ని ఆర్జించింది. అలాగే 440 బస్సులు 3,52,146 కిలోమీటర్లు మేరకు తిరిగాయి.

విశేష ఆదరణ



సంక్రాంతి పండగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం తిప్పిన ప్రత్యేక బస్సు సర్వీసులకు విశేష ఆదరణ లభించింది. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి నడిపిన బస్సుల ద్వారా రూ.కోటికి పైగా ఆదాయం వచ్చింది. గతంలో ప్రత్యేక సర్వీసుల పేరిట వసూలు చేసిన 50 శాతం అదనపు చార్జీల నుంచి ఈసారి మినహాయింపు లభించడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయాల వైపు మరలకుండా ఆర్టీసీ బస్సులపైనే విశ్వాసం చూపారు. దీంతో ఈ ఆదాయం సాధ్యమైంది.

– ఎన్వీఆర్ వరప్రసాద్, జిల్లా ప్రజా రవాణా అధికారి, ఏలూరు

విద్యుత్ ప్రమాదాల నివారణకు శిక్షణ

ఈపీడీసీఎల్ హెచ్ఆర్డీ సీజీఎం రవికుమార్



జంగారెడ్డిగూడెం: విద్యుత్ ప్రమాదాల నివారణకు సిబ్బందికి ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ హెచ్ఆర్డీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎ.రవికుమార్ చెప్పారు. జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలు, విద్యుత్ సరఫరా, అవినీతి ఫిర్యాదులు తదితర అంశాలను పరిశీలించేందుకు తాను వచ్చానన్నారు. ఉద్యోగుల సర్వీస్ సమస్యలు, పెన్షన్లు, కుటుంబాలకు సంబంధించి ఫ్యామిలీ పెన్షన్లు సక్రమంగా అందుతున్నాయా లేదా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే విషయాలు తెలుసుకున్నామన్నారు. ప్రమాదాలకు సంబంధించి పరిహారం సరైన సమయంలో వచ్చిందా లేదా అనేది పరిశీలిస్తున్నామన్నారు. విద్యుత్ సమస్యలు, అవినీతి ఆరోపణలు ఉంటే విద్యుత్ కార్యాలయాల్లోని జగనన్న కంప్లయింట్ బాక్సుల్లో ఫిర్యాదులు వేయవచ్చన్నారు. ప్రమాదాల సమయంలో సిబ్బంది ప్రాణహాని నివారించేందుకు శిక్షణ దోహదపడుతుందని, శిక్షణ నిరంతర ప్రక్రియ అని అన్నారు.

పునరావాస కాలనీల్లో ప్రత్యేక చర్యలు

పోలవరం పునరావాస కాలనీలకు సంబంధించి విద్యుత్ సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఆయన అన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ఆయా కాలనీలను అనుసంధానిస్తూ సబ్స్టేషన్ల నిర్మాణం కూడా చేపట్టామన్నారు. ప్రస్తుతం చీమలవారిగూడెంలో నూతన సబ్స్టేషన్ను నిర్మిస్తున్నామన్నారు. ప్రజావసరాలు దృష్ట్యా జంగారెడ్డిగూడెంలో 4 ఫీడర్లు ఏర్పాటు చేశామని, ఈ క్రమంలోనే స్థానిక బైనేరు వద్ద సబ్స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. హెచ్ఆర్డీ జీఎం యూఆర్కే రాజు, జంగారెడ్డిగూడెం డివిజన్ ఈఈ కేఎం అంబేడ్కర్ పాల్గొన్నారు.

వెబ్సైట్లో ఎన్ఎంఎంఎస్ హాల్టికెట్లు

ఏలూరు (ఆర్ఆర్పేట): 2022–23 విద్యా సంవత్సరానికి ఈనెల 5న జరుగనున్న ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాల్టికెట్లను వెబ్సైట్లో అందుబాటులో ఉంచినట్లు ఇన్చార్జి జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ అవధాని ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష నిర్వహిస్తారని, ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్సైట్ బీఎస్ఈ ఏపీలో హాల్టికెట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. స్కూల్ లాగిన్ ద్వారా ప్రధానోపాధ్యాయులను సంప్రదించి విద్యార్థులు హాల్టికెట్లు పొందవచ్చని సూచించారు.

న్యూస్‌రీల్

సమన్వయంతో పెద్దింట్లమ్మ జాతర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోరారు. ఈనెల 21 నుంచి వచ్చేనెల 7 వరకు జరుగనున్న జాతర సందర్భంగా సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం జాతర చైర్మన్, ఏలూరు ఆర్డీఓ పెంచెల కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయం వద్ద నిర్మించిన అనివేటి మండపం భక్తులకు అందుబాటులోకి వస్తుందన్నారు. ఆలయ ఈవో కేవీ గోపాలరావు, ఆర్డీఓ కిషోర్ జాతర ఏర్పాట్లను వివరించారు. దేవస్థానం వద్ద అన్నిశాఖల సిబ్బంది కలిసి హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. సర్కారు కాల్వ కర్రల వంతెన, ఇతర వాహన పార్కింగ్ ప్రాంతాల్లో వసూలు చేసే రుసుంలను పెద్ద అక్షరాల బోర్డులను ప్రదర్శించాలన్నారు. పారిశుద్ధ్య పనులు మూడు విడతలుగా జరగాలని సూచించారు. రాష్ట్ర వడ్డీల వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సైదు గాయత్రీ సంతోషి, ఎంపీపీ అడవి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు



విద్యార్థినులతో మాట్లాడుతున్న నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరులో శనివారం నుంచి జరిగే హేలాపురి బాలోత్సవం 3వ పిల్లల సంబరాల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఆహ్వాన సంఘం నాయకులు గుడిపాటి నరసింహారావు, అడుసుమిల్లి నిర్మల తెలిపారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవనం వద్ద ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలోత్సవం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వచ్ఛందంగా వచ్చి భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. 60 రకాల సాంస్కృతిక, అకడమిక్ పోటీల్లో 7,400 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు, ఉపాధ్యాయులందరికీ ఉచిత భోజన ఏర్పాట్లు చేశామన్నారు. అమరావతి బాలోత్సవం నాయకులు యూవీ రామరాజు, హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘం నాయకులు పి.కస్తూరిబాయి, ఎ.సుందరి, ఎస్.గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

21 కిలోల గంజాయి స్వాధీనం

తణుకు: గంజాయి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి సుమారు 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ తెలిపారు. స్థానిక అజ్జరం కాలనీ రోడ్డులో టిడ్కో గృహాల వద్ద గంజాయి నిల్వ ఉన్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. పట్టణానికి చెందిన షేక్ కమల్ అతని కుమారుడు ఇబ్రహీంతోపాటు రేలంగికి చెందిన కర్రి రాంబాబు, కోడెల సాయిప్రసాద్‌కు గంజాయి విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను గురువారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

జగ్గయ్యపేట అర్బన్: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జరిగిన 66వ ఏపీ స్టేట్ స్కూల్‌గేమ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–19 బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎ.అరుణేష్ బాబు విజేతగా నిలిచాడు.

ప్రమాదాల నివారణకు కృషిచేయాలి

జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ



జోనల్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన డ్రైవర్ బీవీఆర్ఎం రావుకు బహుమతి అందిస్తున్న ఎస్పీ



డి.ప్రసాదరావు (ఏలూరు)



బీపీ రావు (నూజివీడు)



చెల్లెయ్య (ఏలూరు)



ఆర్వీ రావు (ఏలూరు)



బీకే రెడ్డి (జంగారెడ్డిగూడెం)



డీవీకే రావు (నూజివీడు)

ఏలూరు (ఆర్ఆర్పేట): ఆర్టీసీ డ్రైవర్లు తమ అనుభవాన్నంతా రంగరించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేయాలని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక డిపో గ్యారేజీలో ఆర్టీసీ రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వేగాన్ని నియంత్రించుకుని బస్సులను నడపాలని, ప్రయాణికులకు సురక్షిత ప్రయాణాన్ని అందించాలన్నారు. 35 ఏళ్లు పైబడిన డ్రైవర్లు ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలని సూచించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.విజయరాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎన్వీఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు భద్రతను ఆర్టీసీ సిబ్బంది తమ బాధ్యతగా స్వీకరించాలన్నారు. అందరి సహకారంతో జిల్లా ఆర్టీసీ సిబ్బంది స్ఫూర్తివంతంగా పనిచేస్తున్నారని కితాబునిచ్చారు. ప్రమాదరహితంగా బస్సులను నడపాలని కోరారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లకు నగదు బహుమతులు, వారి సతీమణులకు పసుపు, కుంకుమ చీరలను ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ చేతులమీదుగా అందజేశారు. రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉత్తమ డ్రైవర్లు వీరే..

- విజయవాడ జోనల్ స్థాయిలో.. బీవీఆర్ఎం రావు (ఏలూరు) ప్రథమ స్థానంలో నిలిచారు.
- జిల్లా స్థాయిలో..డి.ప్రసాదరావు (ఏలూరు) ప్రథమ, బీపీ రావు (నూజివీడు) ద్వితీయ, జె.చెల్లయ్య (ఏలూరు) తృతీయ స్థానంలో నిలిచారు.
- ఏలూరు డిపోలో.. ఆర్వీ రావు, ఎంవీఆర్ఎస్ కృష్ణ, పీఆర్ శేఖర్
- జంగారెడ్డిగూడెం డిపోలో.. బీకే రెడ్డి, డీవీఎస్ఎన్టీ రాజు, ఎస్కేఎం షాహిర్
- నూజివీడు డిపోలో.. డీవీకే రావు, కేఆర్ కృష్ణ, బీవీ రావు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



అవధాని, ఇన్‌చార్జి డీఈఓ

ఏలూరు (ఆర్ఆర్పేట): ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, విద్యారంగ అభివృద్ధికి సహకరించాలని ఏలూరు జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి మంగిపూడి వెంకట అవధాని కోరారు. స్థానిక డీఈఓ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్–1గా పనిచేస్తున్న ఆయన ఇన్‌చార్జి డీఈఓగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 10వ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు బోధన అందించాలన్నారు. ప్రతి పాఠశాలలో నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని సమయానికి అందించాలని, మెనూను సక్రమంగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాగా సమగ్రశిక్ష అభియాన్ అదనపు పథక సంచాలకుడిగా (ఇన్‌చార్జ్)గా ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్–2గా పనిచేస్తున్న ఎండీఐఎం షరీఫ్ కూడా గురువారం బాధ్యతలు స్వీకరించారు.

మేజిస్ట్రేట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కొవ్వూరు రెండో స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పోస్టును తాత్కాలిక పద్ధతిపై భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి ప్యానెల్‌లో తమ పేర్లు చేర్చడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 15 లోపు జిల్లా జడ్జి, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు, ఏలూరుకు అందేలా పంపాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల గౌరవ వేతనంగా చెల్లిస్తారని తెలిపారు. ఏపీ హయ్యర్ జ్యుడీషియల్, ఏపీ జ్యుడీషియల్ మినిస్టీరియల్ సర్వీసెస్‌లో లా డిగ్రీ కలిగి, జిల్లా మున్సిఫ్ కోర్టు స్థాయిలో హెడ్ క్లర్క్ స్థాయి, అంతకంటే ఎక్కువ స్థాయి లా డిగ్రీ కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఏపీ హైకోర్ట్ సర్వీసెస్ నందు సెక్షన్ ఆఫీసర్, ఆపై స్థాయి లేదా 45 ఏళ్లు దాటి బార్ అసోసియేషన్‌లో కనీసం ఐదేళ్లు ప్రాక్టీస్ చేసిన వారు అర్హులని తెలిపారు. నోటిఫికేషన్ తేదీనాటికి 65 సంవత్సరాలు పూర్తి చేయడానికి కనీసం ఒక సంవత్సరం ఉన్నవారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. రిటైర్డ్ జ్యుడీషియల్ అధికారికి ప్రాధాన్యమిస్తామని, నోటిఫికేషన్‌ను అన్ని కోర్టుల్లోని నోటీసు బోర్డుల్లో, ఏలూరు, భీమవరం కలెక్టరేట్లలో, జిల్లాలోని అన్ని బార్ అసోసియేషన్లలోని నోటీసు బోర్డు ల్లో ప్రదర్శించాలని ఆదేశించినట్లు ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ తెలిపారు.

● గడపగడపకూ సంక్షేమం



ద్వారకాతిరుమల: కోడిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



ఉంగుటూరు: రామన్నగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

క్రీడలను ప్రోత్సహించడంలో సాక్షి కృషి ప్రశంసనీయం


రిబ్బన్ కట్‌చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీఓ దాసి రాజు, చిత్రంలో గాదిరాజు బాబు తదితరులు

- ఆర్డీఓ దాసి రాజు
- ఉత్కంఠ భరితంగా సాగిన తొలిరోజు క్రికెట్ మ్యాచ్‌లు

సాక్షి, భీమవరం: క్రీడలను ప్రోత్సహించేందుకు సాక్షి మీడియా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు క్రీడాకారులకు ఎంతో ప్రయోజనకరమని భీమవరం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాలలోని గన్నాబత్తులవారి క్రీడా మైదానంలో వారం రోజుల పాటు నిర్వహించే జిల్లా స్థాయి సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీఓ రాజు గురువారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. క్రికెట్‌లో మన జిల్లా నుంచి జాతీయ స్థాయికి వెళ్లిన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. మరో అతిథి డీఎన్నార్ కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు) మాట్లాడుతూ గత ఐదేళ్లుగా సాక్షి మీడియా ఎంతో ప్రతిష్టాత్మకంగా క్రికెట్ పోటీలు నిర్వహించడం, ఇందుకు తమ కళాశాలను ఎంచుకోవడంతో సంతోషదాయమని అన్నారు. వారం రోజులు పాటు నిర్వహించే పోటీల్లో దాదాపు 26 టీమ్‌లు పాల్గొనడం విశేషమన్నారు. తొలుత ఆర్డీఓ రాజు క్రికెట్ పోటీల పిచ్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. భీమవరంలోని డీఎన్నార్ కళాశాల, బీవీ రాజు కళాశాలల టీమ్‌లను పరిచయం చేసుకున్నారు. ఆర్డీఓ రాజు బ్యాటింగ్ చేయగా గాదిరాజు సత్యనారాయణరాజు బౌలింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సాక్షి తాడేపల్లి గూడెం బ్రాంచి మేనేజర్ వెంకట శివుడు, సిబ్బంది, డీఎన్నార్, బీవీరాజు కళాశాలలో పీడీలో నర్సింహరాజు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మొదటి మ్యాచ్ విజేత విష్ణు జట్టు


మొదటి మ్యాచ్ విజేత విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల జట్టు

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఉత్కంఠగా సాగాయి. మొదటి మ్యాచ్ భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల, డీఎన్నార్ కళాశాలల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన విష్ణు కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 51 పరుగులు చేయగా, ఛేదనలో డీఎన్నార్ కళాశాల జట్టు 6 వికెట్ల నష్టానికి 48 పరుగులు చేసింది. ఆఖరి వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో విష్ణు కళాశాల మూడు పరుగుల తేడాతో విజయం సాధించింది.

సీఆర్ఆర్‌పై స్వర్ణాంధ్ర గెలుపు


మూడో మ్యాచ్ విజేత స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు

మూడో మ్యాచ్‌లో స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (నర్సాపురం), సీఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల (ఏలూరు) జట్లు తలపడ్డాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు వచ్చిన స్వర్ణాంధ్ర జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 102 పరులుగు చేసింది. ఛేదనలో సీఆర్‌రెడ్డి కళాశాల జట్టును 33 పరుగులకే ఆలౌట్ చేసి స్వర్ణాంధ్ర విజయం సాధించింది.

ఎస్ఆర్‌కేఆర్ జట్టుకు భారీ విజయం

రెండో మ్యాచ్‌లో ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల (భీమవరం) జట్టు మొదటి నుంచీ ఆధిక్యం ప్రదర్శించి వెస్ట్ గోదావరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కళాశాల (నల్లజర్ల)పై భారీ విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన ఎస్ఆర్‌కేఆర్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 148 భారీ స్కోరు నమోదు చేసింది. సోహెల్ 103 పరుగులతో సెంచరి సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం ఎస్ఆర్‌కేఆర్ జట్టు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని 25 పరుగులకే ఆలౌట్ చేసింది.



రెండో మ్యాచ్ విజేత ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు, 103 పరుగులు చేసిన బ్యాటర్ మహ్మద్ సోహెల్

నేటి మ్యాచ్‌ల వివరాలు

1. ఎస్‌సీఐబీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల (తణుకు), డీఎన్నార్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (భీమవరం)
2. సర్‌సీఆర్ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (ఏలూరు), శ్రీ విష్ణు కాలేజ్ ఆఫ్ ఫార్మశీ (భీమవరం)
3. ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఏలూరు), బీవీ రాజు కళాశాల (భీమవరం)

శ్రీవారి హుండీల ఆదాయం రూ.2.13 కోట్లు


హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, హుండీలలో వచ్చిన విదేశీ కరెన్సీ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామివారి ఆలయ హుండీల ఆదాయం గడచిన 23 రోజులకు నగదు రూపేణా రూ.2,13,77,918 లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. కానుకల రూపేణా 302 గ్రాముల బంగారం, 10.201 కేజీల వెండి, అధికంగా విదేశీ కరెన్సీ లభించాయన్నారు. లెక్కింపులోకి రాని రద్దైన రూ.1,000, రూ.500 నోట్లు ద్వారా రూ.9 వేలు లభించినట్టు చెప్పారు. గురువారం స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ హుండీల ఆదాయాన్ని లెక్కించామని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

హౌసింగ్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం


తుక్కులూరులో స్థానికుల సమస్య తెలుసుకుంటున్న హౌసింగ్ పీడీ వేణుగోపాల్

- నిర్మాణ సామగ్రి పంపిణీలో అవకతవకలపై మంత్రి దృష్టికి
- ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లను సరెండర్ చేసిన పీడీ

నూజివీడు: నూజివీడు మండలం తుక్కులూరు జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు నిర్మాణ సామగ్రి తగ్గించి ఇస్తున్న హౌసింగ్ అధికారులపై ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ అధికారుల నిర్వాకాన్ని గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. విజిలెన్స్ విచారణ వేయాలని కోరారు. తుక్కులూరు జగనన్న కాలనీల్లో దాదాపు 200లకు పైగా గృహాలు మంజూరయ్యాయి. హౌసింగ్ ఏఈ సతీష్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సామగ్రి ఇవ్వకుండా తగ్గించి ఇస్తున్నారని లబ్ధిదారులు ఎమ్మెల్యే ప్రతాప్ దృష్టికి తీసుకెళ్లారు. బేస్‌మెంట్ లెవల్‌కు ఒక్కొక్క లబ్ధిదారుడికి ఇనుప చువ్వలు 8 ఎంఎం, 10 ఎంఎం, 12 ఎంఎం సైజు 15 చొప్పున ఇవ్వాల్సి ఉండగా, 14 చొప్పున మాత్రమే ఇస్తున్నారని, శ్లాబ్ సమయంలో 8 ఎంఎం చువ్వలు 30 ఇవ్వాల్సి ఉండగా 28 మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. సిమెంట్ బస్తాకు ముఠా కూలి కింద రూ.13 వసూలు చేస్తున్నారని, ఇనుమును రెండుసార్లు లోడు చేసినందుకు దాదాపు రూ.800 వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం

తుక్కులూరులో అవకతవకల విషయాన్ని ఎమ్మెల్యే ప్రతాప్ హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన హుటాహుటిన నూజివీడు వచ్చారు. ఎమ్మెల్యే ప్రతాప్‌ను కలిసి అనంతరం స్థానిక అధికారులను తీసుకొని తుక్కులూరు జగనన్న కాలనీకి వెళ్లి లబ్ధిదారులను సమస్య అడిగి తెలుసుకున్నారు. తప్పు చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని, ఏఈ, ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్‌లను తన కార్యాలయానికి సరెండర్ చేస్తున్నట్టు పీడీ చెప్పారు.

భర్తను హత్య చేయించిన భార్య


మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న పోలీసు అధికారులు

ముసునూరు: నెల రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి కేసులో మిస్టరీ వీడింది. వ్యాను డ్రైవ్ చేసుకుంటూ ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి సగం కాలిపోయి, తమ్మిలేరులో పూడ్చి కనిపించడంతో బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తుండడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆ వివరాలను గురువారం నూజివీడు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ విలేకర్లకు వెల్లడించారు. ముసునూరు మండలం యల్లాపురానికి చెందిన రాయనపాటి రాటాలు (కాశి) (36) తన వ్యానులో ఇసుకలోడుతో రమణక్కపేటలో దిగుమతికి వెళ్లి రెండ్రోజులయినా ఇంటికి రాకపోవడంతో తండ్రి సత్యనారాయణ ముసునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గ్రామంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఫోన్ డేటా ఆధారంగా అనుమానితులను విచారణ చేశారు. దీంతో భయపడిన నిందితుడు తహసీల్దార్ వద్దకు వెళ్లి, విషయాలు చెప్పి, అదృశ్యమైన వ్యక్తిని హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు. రాటాలు భార్యతో గార్లమూడి లోకేష్ (20)కు వివాహేతర సంబంధం ఉంది. దీనికి అడ్డుగా ఉన్న రాటాలును రాటాలు భార్య సలహాతో హత్య చేయించేందుకు లోకేష్ పక్కా ప్రణాళిక వేశాడు. తన పాత స్నేహితునితో ఒప్పందం కుదుర్చుకుని, ఇసుక టోడు తీసుకురావాలని ఫోన్ చేయించాడు. విషయం తెలియని రాటాలు ఇసుక లోడుతో సూరేపల్లి చేరుకున్నాడు. అప్పటికే మిరియాల పాడితో సిద్ధంగా ఉన్న ఇద్దరు రాటాలు ముఖంపై చల్లి కర్రలతో తలపై గట్టిగా మోదారు. స్పృహ కోల్పోయిన రాటాలును అక్కడి నుంచి లోపూడి అడవిలోనికి వ్యానులో తీసుకెళ్లారు. మార్గం మధ్యలో కొనుగోలు చేసిన పెట్రోలు పోసి దహనం చేశారు. ఇంటికి వచ్చిన నిందితుడు అనుమానంతో తిరిగివెళ్లి చూడగా మృతదేహం పూర్తిగా కాలలేదు. దీంతో మరో ఇద్దరి సాయంతో తన వ్యానులో మృతదేహాన్ని యల్లాపురం గ్రామంలోని తమ్మిలేరులో పాతిపెట్టినట్లు అంగీకరించాడు. సీఐ ఆర్ అంకబాబు ఆధ్వర్యంలో ఎస్సై ఎం.కుటుంబరావు నిందితుడిని బుధవారం అదుపులోకి తీసుకుని, ఘటనా స్థలాలను గుర్తించారు. గురువారం తహసీల్దార్ దాసరి సుధ సమక్షంలో పంచనామా నిర్వహించి, తమ్మిలేరులో పాతిన మృతదేహాన్ని వెలికి తీయించి, పోస్ట్‌మార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. హత్యలో పాత్రధారులపై కఠిన చర్యలు చేపడతామని డీఎస్పీ చెప్పారు. సమావేశంలో ఆర్ఐ చంద్రశేఖర్, మండల మాజీ వైస్ ఎంపీపీ జలగం శేషగిరి, నూజివీడు ఎస్సై వెంకటేష్ తదితరులున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

స్వల్పగాయాలతో బయటపడిన కుమార్తె



అనిల్ మృతదేహం, గాయాలతో బయటపడిన కుమార్తె విషిక

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం జల్లేరు వంతెన వద్ద లారీ ఢీకొని వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేటు స్కూల్, కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న మండలంలోని చిన్నంవారిగూడెంకు చెందిన బండారు అనిల్‌కుమార్ (30) ఇదే స్కూల్‌లో తన కుమార్తె విషికను వారం రోజుల క్రితం నర్సరీలో చేర్పించాడు. నిత్యం ద్విచక్రవాహనంపై తన కుమార్తెతో అనిల్‌కుమార్ కళాశాలకు వచ్చి సాయంత్రం స్వగ్రామం వెళ్లుతుంటారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం కళాశాల నుంచి తన కుమార్తెతో స్వగ్రామమైన చిన్నంవారిగూడెం వెళుతుండగా జల్లేరు వంతెన వద్ద లారీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో అనిల్‌కుమార్ తల ఒక భాగం చితికిపోయి అక్కడిక్కడే మృతి చెందాడు. చిన్నారి విషిక స్వల్పగాయాలతో బయటపడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అనిల్‌కుమార్ మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయనకు భార్య, ఇద్దకు పిల్లలు ఉన్నారు.

ఏలూరు జాతీయ రహదారిపై దోపిడీ

15 కాసుల బంగారు నగలు కాజేసిన అగంతకులు

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున కారులో ఉన్న ముగ్గురు ప్రయాణికులను దుండగులు చంపుతామని బెదిరించి 15 కాసుల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఏలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాదు జూబ్లీహిల్స్ ప్రాంతానికి చెందిన బబ్బిత కవిత తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలోని బంధువుల ఇంటిలో వివాహానికి హాజరయ్యేందుకు తన మనువడితోపాటు మరో కుటుంబ సభ్యుడితో కలిసి కారులో ప్రయాణమయ్యారు. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఏలూరు శివారులోని జాతీయ రహదారి రత్నాస్ బార్ సమీపంలోకి వచ్చే సరికి విశ్రాంతి తీసుకుందామని భావించారు. జాతీయ రహదారిపై కారు నిలిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందనే ఆలోచనతో సర్వీసు రోడ్డులో కారు నిలిపి విశ్రాంతి తీసుకుంటున్నారు. కొంతసేపయ్యాక కవిత కారుదిగి టాయిలెట్‌కు వెళ్లివచ్చి కారు ఎక్కారు. ఈ సమయంలో కొందరు దుండగులు ఒక్కసారిగా కారు డోర్‌తీసి మహిళను, ఇద్దరు వ్యక్తులను బెదిరించారు. నగలు, నగదు ఇవ్వకుంటే చంపుతామని బెదిరించారు. కవిత తనవద్ద ఉన్న నాలుగు కాసుల హారం, నాలుగు కాసుల నెక్లెస్, నాలుగున్నర కాసుల గొలుసు, చెవి దిద్దులు మొత్తంగా 15 కాసుల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. తీవ్ర భయాందోళనకు గురైన బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఘటనా స్థలానికెళ్లి పరిశీలించి, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.